క్లుప్తంగా

మద్దమాంబకు పౌర్ణమి పూజలు


విశేష అలంకరణలో అమ్మవారు

మద్దికెర : స్థానిక మద్దమాంబ దేవాలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, ఆకుపూజ, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టి నైవేద్యం సమర్పించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు స్థానికులు యాటాగారి బాలరంగయ్య కుటుంబీకులు అన్నదానం చేశారు.మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు, రాయుడు, కృష్ణ పాల్గొన్నారు. అలాగే.. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో పున్నమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం చేశారు. నిర్వాహకులు విజయ్ పాల్గొన్నారు.

గోపూజతో సకల సౌభాగ్యాలు


పెరవలిలో గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు రంగస్వామి

మద్దికెర : గోపూజతో సకల సౌభాగ్యాలు కలుగుతాయని మండలంలోని పెరవలి రంగానాథ స్వామి దేవాలయ కార్యనిర్వహణాధికారి వీరయ్య, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున అన్నారు. సోమవారం ఆలయంలో తెల్లవారుజామున అర్చకులు గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రంగనాథస్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం గోమాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

కోలుకోలేక ఉపాధ్యాయుడు మృతి


లింగుట్ల మురళీ మోహన్ (ఫైల్)


మద్దికెర : మండల పరిధిలోని బురుజుల గ్రామానికి చెందిన 1998 క్వాలిఫైడ్ ఉపాధ్యాయుడు లింగుట్ల మురళీ మోహన్ (58) సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. 2023 జూలైలో 1998 క్వాలిఫైడ్ అయిన వారికి మినిమమ్ టైం స్కేల్ కింద ఉపాధ్యాయుడిగా గత ప్రభుత్వంలో నియమించారు. మండలంలోని హంప గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా.. గత నెల 21న బళ్లారికి ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం బెంగళూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య జయశ్రీ, కూతురు, కుమారుడు ఉన్నారు. ఎస్టీయూ తరఫున ఆంజనేయులు, శీనప్ప, చంద్రశేఖర్, రహంతుల్లా సంతాపం వ్యక్తం చేశారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

హొళగుంద: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. మండల కేంద్రానికి చెందిన ఎరుకుల దేవేంద్ర, బసవ అనే క్రీడాకారుల జ్ఞాపకార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మూడు రోజులు పాటు జరిగే పోటీలను ఎస్ఎంసీ చైర్మన్ ద్వారకనాథ్, గ్రామపెద్దలు తిక్కస్వామి, మోహిన్, ఎల్లార్తి అర్జున్ ప్రారంభించారు. మొదటి రోజు వారియర్స్ లెవెన్, హొళగుంద లెవెన్ జట్లు తలపడగ హొళగుంద లెవెన్ విజయం సాధించింది. హొళగుంద లెవెన్ జట్టుకు చెందిన సంజయ్‌రాజు అనే కానిస్టేబుల్ 27 బంతుల్లో 65 రన్‌లో చేశాడు. ఫైనల్‌లో గెలిచిన విన్నర్ జట్టుకు రూ.10 వేలు, రన్నర్ జట్టుకు రూ.5 వేలను పారిశ్రామికవేత్త రాజాగౌడ్ అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆస్పరి: సంక్రాంతి పండుగా సందర్భంగా మండల కేంద్రంలో ఆస్పరి యూత్ ఆసోసియేషన్ ఆధర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సర్పంచ్ మూలింటి రాధమ్మ ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, ఎస్ఐ నరసింహులు, కేడీసీసీ బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, నిర్వాహకులు మేకల రంగనాథ్, రామకృష్ణ, మహేష్, సతీష్, రవి పాల్గొన్నారు. పోటీల్లో 30 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు.



తుగ్గలి, పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో భోగి మంటలు వేసిన దృశ్యం


బోయబొంతిరాళ్లలో భోగి మంట వేసిన దృశ్యం


మద్దికెరలో సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వేసిన ముగ్గు

సంప్రదాయంగా భోగి వేడుకలు

- ఆకట్టుకున్న రంగవల్లులు
- భోగి మంటలు వేసిన పల్లె జనం
- చిన్నారులకు భోగి పళ్లు పోసిన కుటుంబ సభ్యులు


పి.కోటకొండలో కబడ్డీ ఆడుతున్న యువకులు

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం వేకువజామున నుంచే భోగి మంటలు వేసి, బంధుమిత్రులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి సంప్రదాయాన్ని చాటుకున్నారు. మహిళలు రంగవల్లులతో వాకిళ్లను సుందరంగా తీర్చిదిద్దారు. పోటాపోటీగా ముగ్గుల ప్రదర్శన చేపట్టారు. ముగ్గులపై గొబ్బెమ్మలను పెట్టి హరిదాసులను స్వాగతించారు. నువ్వుల పిండి, సజ్జ రొట్టెలు, కలగూర కూర, పులగం, వెన్నతో ఇంటిల్లిపాదీ ఆరగించారు. చిన్నారులు గాలిపటాలు ఉత్సాహంగా ఎగురవేశారు. తమ కష్టాలు తొలగించాలని గ్రామాల్లో ప్రజలు ఆలయాల్లో మొక్కుతీర్చుకున్నారు.

పత్తికొండ/తుగ్గలి : భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేసి ఇళ్లలోని పాత కట్టె వస్తువులను మంటల్లో వేసి సందడి చేశారు. మహిళలు తలంటు స్నానాలు చేసి ఇళ్ల ముందు కల్లాపి చల్లి రంగువల్లులు అద్ది అందులో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు, పూలు ఉంచి పూజలు చేశారు.

ఆస్పరి: మండలంలో సోమవారం భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో తెల్లవారుజామునే మహిళలు ఇళ్ల ముందు కల్లాపిజల్లి రంగవళ్లులను తీర్చిదిద్దారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. రామతీర్థంలో వెలసిన గాయిత్రీ మాతను భక్తులు దర్శించుకున్నారు.

నేడు కైరుప్పలలో ముగ్గుల పోటీలు..

సంక్రాంతి పండుగ సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కైరుప్పల గ్రామంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకుడు రమేష్ తెలిపారు. గెలుపొందిన మహిళలకు వరుసగా రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.2,500, రూ.1,500, రూ.1,200, 1,000 ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఆలూరు రూరల్: మండలంలో భోగి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున మహిళలు ఇంటి ముందు కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. స్థానిక ఎన్జీఓస్ కాలనీలో ఏర్పాటు చేసిన భోగి మంటల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కనిపించని క్రాంతి

కృష్ణగిరి (వెల్దుర్తి) : పట్టణంతోపాటు, పల్లెల్లో సంక్రాంతి సందడి కానరాలేదు. భోగి రోజు కనిపించే సందడి పూర్తిగా అదృశ్యమైంది. కేవలం సెలవులకు వచ్చిన పిల్లలు, ఇళ్ల ముందు ముగ్గులు వేసి కానిచ్చేశామంటూ జరుపుకున్నారు. గతంలో మాదిరిగా భోగి మంటలు వీధుల్లో కనిపించలేదు. కిరాణం షాపులు, కూరగాయాల కొనుగోళ్లు అంతంత మాత్రమే అంటూ వ్యాపారులు చెబుతున్నారు. పతంగులు సైతం ఎక్కువగా కానిపించలేదు. ముఖ్యంగా పంటలు సరిగా చేతికందక, ప్రభుత్వ సహాయం లేక ప్రజలు మకర సంక్రాంతి కాస్తా మసక సంక్రాంతిగా మారింది.

ఊరూరా సంక్రాంతి సంబరాలు

దేవనకొండ: మండలంలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. సోమవారం భోగి పండగను మండలంలోని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. భోగి మంటలను వేసుకుని చలి కాచుకున్నారు. ఉదయాన్నే రేగిపండ్లు, నువ్వులతో స్నానం చేశారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకోనున్నారు. మండలంలోని పి.కోటకొండ గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు.

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో సోమవారం భోగి పండుగ సంప్రదాయ ప్రకారం జరుపుకున్నారు.


ఆస్పరిలో ఆకట్టుకునేలా రంగవల్లి


ఆలూరు ఎన్జీస్ కాలనీలో వేసిన రంగవల్లి


రాంపల్లిలో ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కనుల పండువగా గోదాదేవి కల్యాణం


కల్యాణం అనంతరం శ్రీరంగనాథుడు, గోదాదేవి


దేవాలయంలో వేసిన గోదాదేవి ముగ్గు


గరుడ వాహనంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

మద్దికెర: మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథుడు, గోదాదేవి కల్యాణోత్సవం సోమవారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. ముందుగా స్వామి వార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు గోదాదేవి, శ్రీరంగనాథస్వామి వార్ల ఉత్సవమూర్తులను పెళ్లిపీటలపై కొలువుంచి మంత్రోచ్చారణలుభక్తాదుల మధ్య కల్యాణోత్సవం జరిపించారు. గ్రామపురవీధులల్లో ప్రభోత్సవం నిర్వహించారు.కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు తగ్గించాలి

- భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం


దేవనకొండలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం పత్తికొండ జగ్జీవన్‌రామ్ కాలనీలో పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చార న్నారు. కానీ ఇప్పుడు సర్దుబాటు చార్జీల పేరుతో జనంపై భారం మోపుతున్నారని విమర్శించారు. విద్యుత్ భారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే.. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర పిలుపు మేరకు సోమవారం అంబేద్కర్ సర్కిల్‌లో భోగి మంటల్లో పెంచిన విద్యుత్ చార్జీల జీవో ప్రతులను దహనం చేశారు. రాజాసాహెబ్, రామాంజినేయులు, సురేంద్రకుమార్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆలూరు: కూటమి ప్రభుత్వం వినియోగదారులపై సుమారు రూ.20 కోట్ల విద్యుత్ భారాన్ని మోపిందని ఆలూరు నియోజకవర్గ సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు సీఐటీయూ నాయకుడు కృష్ణ అన్నారు. సోమవారం తెల్లవారు జామున భోగి పండుగ సందర్భంగా పెంచిన విద్యుత్ బిల్లులను ఆలూరులోని గుంతకల్లు రోడ్డు సమీపంలో భోగి మంటల్లో బిల్లులు వేసి నిరసన వ్యక్తం చేశారు. మండలం కార్యదర్శి షాకీర్, డీవైఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్,ఎల్లప్ప,మల్లి పాల్గొన్నారు.

దేవనకొండ: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం దేవనకొండలో పెరిగిన విద్యుత్ చార్జీల బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేశారు.

ఆస్పరి: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా మండలంలోని చిరుమాన్‌దొడ్డి, వలగొండ, కైరుప్పల గ్రామాల్లో విద్యుత్ బిల్లులను సీపీఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు రంగస్వామి, శివరాజ్, నాగరాజు, వీరభద్ర, రవి, రాము, శివ, రాజు, భోగి మంటల్లో వేసి కాల్చారు.

హొళగుంద: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వల్ల రాష్ట్ర ప్రజలకు సంతోషం లేని సంక్రాంతిని కానుకగా ఇచ్చిందని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, నాగరాజు విమర్శించారు. సోమవారం వారు స్థానిక బస్టాండులో సీపీఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. హమాలి సంఘం నాయకులు కట్టెప్ప, ద్యావన్న, ఈడిగ రాముడు, ఈరన్న, వాసప్ప, గురుపాద, ఆలం పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే విరూపాక్షితో అర్థగేరి శ్రీనివాసులు

హాలహర్వి: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని అర్థగేరి శ్రీనివాసులు అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా ఇటీవల ఆయనను నియమించిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే విరూపాక్షిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కామినహాల్ జనార్ధన్, చిప్పగిరి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, హాలహర్వి మండల వైస్ ఎంపీపీ నగేష్, నాయకులు కృష్ణ, పరశురామ్, సుంకన్న పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు


బుసినే విరూపాక్షి, ఎమ్మెల్యే,ఆలూరు

ఆలూరు రూరల్: సంక్రాంతి సందర్భంగా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సకల సంపదలతో శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది పంటలు బాగా పండి రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో గడపాలని అభిలాషించారు.

సీపీఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

పత్తికొండ(తుగ్గలి) : భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవం పురస్కరించుకొని భోగి పండుగ సందర్భంగా సోమవారం స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి కింద బీరువాను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, రెండ బహుమతి డ్రెస్సింగ్ టేబుల్‌ను ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కుంపటి సత్యనారాయణ, మూడవ బహుమతి మిక్సీని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అందజేశారు.


మిరపతో నష్టపోతుండటంతో అలారుదిన్నె వద్ద ప్రత్యామ్నాయంగా సాగైన పొగాకు పంట


పత్తి, టమాట స్థానంలో కుంకునూరు సమీపంలో సాగు చేసిన మొక్కజొన్న పంట

దేవనకొండకు చెందిన నరసింహుడు సొంత పొలం మూడెకరాల్లో ఏటా పత్తి సాగు చేసేవాడు నష్టాలు పెరుగుతుండటంతో ప్రస్తుతం రబీలో భాగంగా గోరుచిక్కుడు వేశాడు. ప్రతి ఏడాది పత్తి, టమాట సాగుతో పెట్టుబడులు రాకపోగా తెగుళ్లు పెరిగిపోతుండటంతో కుంకునూరుకు చెందిన నజీర్ తనకుకున్న రెండెకరాల్లో ఇప్పుడు మొక్కజొన్న పంట వేశాడు. అలారుదిన్నెకు చెందిన వెంకటేశ్వర్లు తనకున్న నాలుగెకరాల్లో ప్రతి సంవత్సరం మిరప పంట సాగు చేస్తుండేవాడు.. అయితే దిగుబడులు పెరగకపోవడం, పెట్టుబడి క్రమంగా పెరుగుతుండటంతో ఈ ఏడాది పొగాకు సాగు చేశాడు. వీరు మాత్రమే కాదు.. మండలంలోని అధిక శాతం రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు వైపు మళ్లుతున్నారు.

పంట మార్పిడి..అధిక రాబడి!

- ఒకే రకం సాగుతో నష్టాలు
- తగ్గనున్న భూసారం
- ప్రత్యామ్నాయ పంటలపై అవగాహనుండాలంటున్న అధికారులు

మండలంలో పత్తి, మిరప, టమాట అధికంగా సాగు చేస్తారు. ఏటా ఒకే రకమైన పంటలు వేస్తుండటంతో దిగుబడి పడిపోతుండటంతో పాటు ఏటేటా పెట్టుబడి గణనీయంగా పెరుగుతుండటం, పొలాలు నిర్జీవంగా మారుడం, తెగ్గుళ్లు అదుపులోకి రావడంతో నష్టాలే మిగిలేవి. మీడియా ప్రభావం, వ్యవసాయ అధికారుల సూచనలతో ఇప్పుడిప్పుడే పంట మార్పిడికి పూనుకుంటున్నారు. కొందరు మంచి ఫలితాలు చూస్తుండటంతో మరింత మంది స్ఫూర్తి పొంది ప్రత్యామ్నాయ పంటల సాగు చేస్తున్నారు.


దేవనకొండలో పత్తికి బదులుగా రైతు సాగుచేసిన గోరుచిక్కుడు పంట

దేవనకొండ: ఏటా ఒకే రకం పంటను సాగుచేయడం వల్ల భూసారం తగ్గడంతో పాటు చీడపీడలు చుట్టుముట్టి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఏడాదిలో రెండు నుంచి మూడు రకాల పంటల సాగు మార్పిడి పద్ధతి అవలంభించడం వల్ల రైతులకు అధిక దిగుబడులతో లాభాలు వచ్చే అవకాశం ఉంది. పంటల సాగు మార్పిడి పద్ధతికి రబీ సీజన్ అదునుగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు ఇప్పుడిప్పుడే వాస్తవాలను గ్రహించి పంటమార్పిడి సాగు పద్ధతిని అలవాటు చేసుకుంటూ భూసారాన్ని పెంపొందించుకుంటున్నారు.

ఒకే రకం పంటతో నష్టాలే..

జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు టమాట పంటను ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఎంతటి సారవంతమైన పొలాల్లో అయినా ఏటా ఒకే రకం పంట సాగుచేయడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. కొందరు రైతులు పంటల కాలం ముగిసిన తర్వాత రెండు నుంచి మూడు నెలలు విరామం ఇచ్చి అదే నేలలో మళ్లీ గతంలో సాగుచేసిన రకం పంటనే సాగు చేస్తుంటారు. భూమిలో భూసారం తగ్గి నష్టాలే తప్పా ప్రయోజనం కనిపించడం లేదు.

మార్పు మొదలైంది..

వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు ఇప్పుడిప్పుడే తమ ఆలోచనాధోరణిని మార్చుకుంటున్నారు. ప్రధానంగా పంట మార్పిడి చేసే ముందు గతంలో వేసిన ప్రధాన పంటకు భిన్నంగా పెరిగే పైరును ఎంచుకోవాల్సి ఉంటుంది. భూమికి సత్తువ, పోషకాలను ఇచ్చే పైరులను ఎంచుకోవడం లాభదాయకంగా ఉంటుంది. ఈ పద్ధతి వల్ల పైర్ల ఆకులు రాల్చి, భూమికి సేంద్రియ పదార్థాలను అందజేస్తాయి. సూక్ష్మజీవుల చర్య ఫలితంగా ఎంజైములు ఉత్పత్తి అవుతాయి. కంది, శనగ పైర్లు వరుసగా వేస్తే కాయ తొలుచు పురుగులు తాకిడి అధికంగా ఉంటుంది. అదే జొన్న, సజ్జ, రాగి, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ వంటి పంటల సాగుతో పంట మార్పిడి చేసుకోవడం లాభదాయకం.

ప్రత్యామ్నాయ పంటలతో ఫలితాలు

ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు. వరుసగా టమాట సాగుచేసే రైతులు ఆవాలు తదితర ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే సులిపురుగుల ఉధృతి తగ్గుతుంది. వరితో పంట మార్పిడి చేయడం ద్వారా వేరుశనగ పైరుకు సులిపురుగుల బెడద ఉండదు. వంగ తోటలు సాగు చేసేవారు క్యాలీఫ్లవర్ సాగు చేయడం ద్వారా వంగకు ఎండుతెగులు సోకదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు చేయడం వల్ల పొలంలో భూసారం పెంపొందుతుంది. భూసారం పెరగడం వల్ల పంట సాగులో చీడపీడలను కొంత వరకు అరికట్టవచ్చు.

రైతుకు లాభం..పుడమి సారవంతం



పంట మార్పిడితో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయి. భూసారం పెరగడంతో పాటు పంటలకు మంచి పోషకాలు లభిస్తాయి. చీడపీడల నివారణ, పంట పోషకాల కోసం చేసే ఖర్చు సగానికి పైగా తగ్గుతుంది. దీంతో రైతులు లాభపడవచ్చు. రైతులు తప్పనిసరిగా ఈ పద్ధతిని అనుసరిస్తే ప్రయోజనం పొందవచ్చు. ఇప్పుడిప్పుడే రైతులు పంటల మార్పిడి పద్ధతికి అలవాటు పడుతున్నారు. అయితే.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంపొందించుకోవాలి. లేదా వ్యవసాయ అధికారుల సలహా తీసుకోవాలి.

- సురేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి